ఓ శుభ ముహూర్తాన దంపతుల కూతురుకి భాగ్యమ్మ అని పేరు పెట్టుకొన్నారు. భాగ్యమ్మ నిజంగా భాగ్యమే! భాగ్యమ్మ పుట్టినదగ్గర్నుంచీ రామిరెడ్డి పని నిమ్మకునీరెత్తినట్టుంది. రెడ్డి అదృష్టం పండింది.

భాగ్యమ్మ పుట్టిన ఏడే రామిరెడ్డి కొత్త యింటికి పునాదులు తీయించాడు. పడమటి గోడకు పునాదివేస్తూండగా బంగారపు కణికలు దొరికిన్నై! అదంతా తన కూతురు అదృష్టమే అనుకొన్నాడు రెడ్డి. దాంతో మరో ముప్పై ఎకరాలు కొనేశాడు. ఇప్పుడు దాదాపు ఏభైఎకరాల పొలం, ఐదరకల సేద్యం, యిద్దరు జీతగాళ్ళూ. రామిరెడ్డి గ్రామంలో ముఖ్యుల్లో ఒకడు.

భాగ్యమ్మకు మూడేళ్ళు నిండినై. నత్తినత్తిగా మాటలు చెప్తోంది. కొడుకు బాలిరెడ్డికి పదోఏడు వచ్చింది. ఆవు దూడకు పచ్చి పరకలు మేపుతున్నాడు. రామిరెడ్డి చప్పున తేలొచ్చిన కోడె దూడకు అర్రుచేశాడు. బలువుగా లాగుతోన్న యింటి ముసిలెద్దు—పుల్లెద్దును కాడికిందనుంచి తప్పించి, గిత్తను ఎల్లెద్దుకు జత గలిపేడు.

కాని ఆ యేడు ప్రకృతి చిన్నచూపు చూసింది. ఆ తొలినీటి మబ్బులు లేవు. తొలకరి వానలులేవు. ఆ చల్లటి నీటిగాలి లేదు. ఆ కొత్తమట్టి కంపులు లేవు. ఆకాశమంతా పొడిమబ్బులు, వడగాలి.

రైతులు ఆశగా మింటికేసి మబ్బుల్ని చూశారు. దీనంగా బీటలుతీసిన తన భూమిల్ని చూసుకొన్నారు. పొడి గాలిని పెదవులతో తాకుతూ ఆశలతో—నీటి మబ్బులకేసి చూశారు.

రామిరెడ్డి ఆశలు అడియాశలయాయి. ప్రకృతి దేవత పగ పట్టింది. వరుసగా ఒకటీ, రెండూ—మూడు సంవత్సరాలు అదే వడగాలీ, పొడమబ్బులూ, అడియాశలూ, నిట్టూర్పులూను.

ఆకాశంలో తెల్లటి మబ్బులూ, ప్రజల హృదయాల్లో కారుచీకట్లూ అలుముకుపోయినై. జనంలో జవంలేదు. మనుషుల్లో బలం వుడిగిపోయింది.

క్షామదేవత విరుచుకుపడింది. మృత్యువు విలయ నృత్యం సాగించింది! పైశాచికం వికటాట్టహాసం చేసింది!!

చెరువులు ఎండిపోయినయ్. గాదెల్లో ధాన్యం ఖాళీ అయింది. గాదెలకింద పందికొక్కులు స్వేచ్ఛగా తిరుగుతున్నయ్! బావుల్లో నీళ్ళు వట్టిపోయినయ్. మనుషులకు అన్నంలేదు. నీరులేదు. పశువులకు మేతలేదు.

దాదాపు ముప్పైవేల చదరపుమైళ్ళ వైశాల్యం అంతా పొయ్యిమీది పెనంలా మాడిపోతూవుంది. అరవై లక్షల జనం నల్లుల్లా మాడి చస్తున్నారు. నూటపది డిగ్రీల వేడి. అగ్నిగుండంలోని సమిధల్లా మనుషులూ, పశువులూ ఆహుతైపోతున్నారు. "అనాథులంతా, అభాగ్యులంతా అసహాయులంతా.'

ఎక్కడాతిండిలేదు. గంజిలేదు.నీళ్ళులేవు. నేలంతా ఎండిపోయింది. కాలవలూ, చెరువులూ బావులూ ఎండిపోయినై. పంటలు మాడిపోయినయ్. చేలోచల్లిన విత్తు కూడాదక్కలేదు. చెట్లూ, చేమలూ మాడిపోయినయ్. అరణ్యాలుకూడా మాడిపోయినయ్. పచ్చటి బీళ్ళన్నీ

